విజిలెన్స్ నివేదికపై జస్టిస్ ఘోష్ దృష్టి

హైదరాబాద్, జూన్13 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ విభాగం రూపొందించిన నివేదికపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ దృష్టి సారించినట్టు తెలిసింది. విచారణలో భాగంగా నాలుగవ రోజైన గురువారం ప్రాజెక్టు పునరుద్ధరణ, పనుల పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాలజీ, డిజైన్స్, తదితర నిపుణుల కమిటీ సభ్యులను జస్టిస్ ఘోష్ విచారించారు. బరాజ్‌గా నిర్మించి ఎక్కువ నీటిని నిల్వ చేసినందువల్లే సమస్య వచ్చిందని నిపుణులు ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్‌కు చెప్పినట్టు సమాచారం. ప్రాజెక్టు పరిశీలనకు సంబంధించి రెండు వారాల్లోపు మధ్యంతర నివేదిక ఇవ్వాలని నిపుణుల కమిటీని కమిషన్ ఆదేశించినట్టు తెలిసింది. ఇదిలా ఉంటే అఫిడవిట్ల పరిశీలన తరువాత బీఆర్కే భవన్‌లోనే బహిరంగ విచారణ చేపట్టనున్నట్టు కమిషన్ వర్గాలు వెల్లడించాయి. సాంకేతిక అంశాల తర్వాతే ఆర్థిక అంశాలపై దృష్టి సారిస్తుందని కమిషన్‌వర్గాలు తెలిపాయి. అధికారులు, ఏజెన్సీల ద్వారానే కాకుండా ఇతర రూపాల్లో కూడా సమాచారం సేకరిస్తుండడంతోపాటు ఆకస్మిక పర్యటనలకు కూడా వెళ్లేందుకు సిద్ధమవుతుందని సమాచారం.

గొర్రెల పథకంపై ఈడీ ఆరా!

- కేసు వివరాలు కావాలంటూ పశుసంవర్ధకశాఖకు ఈడీ లేఖ
- అన్నీ ఆరోపణలే.. ఆధారాలేవి?

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టిపెట్టింది. రాష్ట్ర అవినీతి నిరోధకశాఖ ఇప్పటికే దీనిపై దర్యాప్తు చేస్తుండగా, ఈడీ అధికారులు కూడా ఆరా తీస్తుండటం గమనార్హం. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్‌కు హైదరాబాద్‌లోని ఈడీ జోనల్ కార్యాలయం జాయింట్ డైరెక్టర్ లేఖ రాశారు. ఈ పథకానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. జిల్లాలవారీగా లబ్ధిదారులు, వారి ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్ నంబర్లు సహా పూర్తి వివరాలు కావాలని అడిగారు. గొర్రెలను ఎక్కడి నుంచి కొని తీసుకొచ్చారు? అమ్మినవారి సమగ్ర వివరాలు, గొర్రెలను ఎక్కడి నుంచి ఎక్కడికి ఎలా తరలించారు.. తరలించడానికి

ఉపయోగించిన ట్రాన్స్‌పోర్టు వాహనాలు, వాటి యజమానుల వివరాలు కూడా కావాలని లేఖలో పేర్కొన్నారు. ఈ పథకంపై ఏసీబీ దర్యాప్తు, మీడియా కథనాలను ఈడీ గమనిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే కొంత సమాచారాన్ని ఏసీబీ అధికారవర్గాల నుంచి తీసుకున్నట్టు సమాచారం. ఈ పథకంపై ఇప్పటికే ఈడీ కేసు నమోదు చేసినట్టు తెలిసింది.

ఆరోపణలే.. ఆధారాలేవి..?

గొర్రెల పంపిణీలో సుమారుగా రూ.700 కోట్ల వరకు అక్రమాలు జరిగి ఉండొచ్చని తెలంగాణ అవినీతి నిరోధకశాఖ తొలుత పత్రికలకు లీకులు ఇచ్చింది. ఈ అక్రమాలకు ఆద్యులెవరు? ఇందులో ఎవరెవరి పాత్ర ఉన్నది? అనే దానిపై ఎక్కడా సరైన ఆధారాలు చూపలేకపోతున్నారు. కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది, దళారులు కొంత వరకు చేతివాటం చూపించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. వీరు చేసిన మొత్తం అక్రమాల విలువ తొలుత చెప్పినట్టు రూ.700 కోట్లు ఏమీ ఉండదని దర్యాప్తులో ఉన్న అధికారులే చెప్తున్నారు. సోమవారం నుంచి బుధవారం వరకు మాజీ ఓఎస్డీ కల్యాణ్, పశుసంవర్ధకశాఖలో మాజీ అధికారి రాంచందర్‌ను ఏసీబీ అధికారులు విచారించారు. విచారణలో కొత్త విషయాలేమీ బయటికి రాలేదని, అధికారులు ఆశించిన సమాధానం రాలేదని తెలిసింది. దీంతో మళ్లీ వారిద్దరిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఈడీ కేసు.. బీజేపీ ఎంపీకే తొలుత ఎలా తెలుసు?

గొర్రెల పంపిణీకి సంబంధించి ఈడీ అధికారులు కేసు నమోదు చేసినట్టు, దర్యాప్తు ప్రారంభించినట్టు బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తొలుత చెప్పారు. ఆయన చెప్పిన కొద్దిసేపటికే ఈడీ అధికారులు రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య అధికారులకు రాసిన లేఖ సోషల్ మీడియాలో కనిపించింది. ఈడీ అధికారులు ఈ కేసు గురించి బహిరంగంగా ఏమీ స్పందించలేదు. కానీ, బీజేపీ ఎంపీ ఇచ్చిన స్టేట్‌మెంటే మీడియాలో ప్రముఖంగా కనిపించింది. ఇది రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈడీ ఆఫీసును బీజేపీ ఆఫీసులోనే పెట్టారంటూ దేశంలో తరచూ వినిపించే ఆరోపణ, విమర్శ నిజమే అన్నట్టుగా గురువారం బీజేపీ ఎంపీ మాట్లాడిన వెంటనే ఈడీ దర్యాప్తు సమాచారం మీడియాలో వచ్చింది. ఇది యాదృచ్ఛికమా? ఉద్దేశపూర్వకంగా జరిగిందా? అంటూ పలువురు రాజకీయ నాయకులు చర్చించుకోవడం కనిపించింది.

పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరు తొలగింపు

- మాజీ మంత్రుల పేర్లు కూడా..
- వారి పేర్లున్న పేజీ ఉపసంహరణ
- ఆదే పేజీపై గమ్ స్టిక్కర్‌ను అతికించి ఇవ్వనున్న విద్యాశాఖ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ఆనవాళ్లు కనిపించకుండా చేస్తామని పదే పదే చెప్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు అన్నంత పనికి ఒడిగడుతున్నది. ఆఖరుకు విద్యార్థులకిచ్చిన పాఠ్యపుస్తకాల్లోనూ కేసీఆర్ పేరు లేకుండా చేస్తున్నది. పుస్తకాలను వెనక్కి తీసుకొని మరీ పేర్లు తొలగించే తంతును చేపట్టింది. రాష్ట్రంలోని విద్యార్థులకు అందజేసిన పాఠ్యపుస్తకాల్లో ముద్రితమైన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి పేర్లను తొలగించాలని సర్కారు నిర్ణయించింది. ఈ పేర్లున్న పేజీపై మరో పేజీని అతికించి ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. గమ్ స్టిక్కర్లు ఉన్న పేజీని ఆ పేజీపై అతికించనున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. గతంలో ఇలాగే పొరపాటు జరిగినప్పుడు పేజీని అతికించామని, ఇప్పుడు అలాగే చేయనున్నట్టు ఆయా వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతుల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసిన విషయం తెలిసిందే. దాదాపు ఈ పుస్తకాల సంఖ్య 25లక్షల వరకు ఉంటుంది. ఈ పుస్తకాల్లోని ముందుమాటలో కేసీఆర్ సహా మాజీ మంత్రుల పేర్లను ప్రస్తావించారు. ఈ విషయం సోషల్‌మీడియాలో రావడంతో ఏదో తప్పు జరిగిందన్నట్టుగా పాఠశాల విద్యాశాఖ ఆగమేఘాల మీద ఆయా పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. అన్ని పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఆయా పుస్తకాలను మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)లో అందజేయాలని ఈ మేరకు మంగళవారం పలు జిల్లాల డీఈవోలు ఆదేశాలిచ్చారు. ఎంఈవోలు ఆయా పుస్తకాలను జిల్లా పుస్తకాల గోడౌన్‌లో తిరిగి అందజేయాలని, ఇది అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆయా పేజీని చింపివేయాలని మంగళవారం మౌఖిక ఆదేశాలిచ్చారు. ఇదే పేజీ వెనక వందేమాతరం, జనగణమనలుండటం, వాటిని అవమానం జరుగుతుందన్న అభ్యంతరాలు టీచర్ల నుంచి రావడంతో ఆఖరుకు పేజీని అతికించాలని నిర్ణయించారు.

ప్రజల దృష్టిని మళ్లించటమే పాలనా?

- పగ, ప్రతీకార రాజకీయాలకు, పరాకాష్టగా రేవంత్ పరిపాలన
- వెలుగులు విరజిమ్మే తెలంగాణగా మార్చిన కేసీఆర్‌కు నోటీసులా?
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ బహిరంగ లేఖ

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ప్రజల దృష్టిని మళ్లించటమే పరిపాలనా? అని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. పగ, ప్రతీకార రాజకీయాలకు, యుక్తులకు పరాకాష్టగా రేవంత్‌రెడ్డి పరిపాలన సాగుతున్నదని ధ్వజమెత్తారు. విద్యుత్తు లోటుతో సతమతమవుతున్న రాష్ట్రాన్ని, మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తీర్చిదిద్ది వెలుగులు విరజిమ్మే తెలంగాణగా మార్చిన కేసీఆర్‌కు సంజాయిషీ నోటీసులా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రైతాంగానికి 24 గంటలు ఉచితంగా నాణ్యమైన విద్యుత్తు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపినందుకు సంజాయిషీ నోటీసులా? అని ప్రశ్నించారు. ప్రతి ఇంటికి, ప్రతి పరిశ్రమకు నిరంతర విద్యుత్తు సరఫరా చేసి, అభివృద్ధికి బాటలు వేసినందుకు సంజాయిషీ నోటీసులా? అని నిలదీశారు. ప్రతీకార రాజకీయాలను పక్కనపెట్టి, ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని రేవంత్ రెడ్డికి సూచించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేశా రు. కేసీఆర్ నాయకత్వంలో వెలుగులు విరజిమ్మిన రాష్ట్రం, కరెంట్ లోటుతో సతమతమవుతున్న ప్రస్తుత పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీకార రాజకీయాలతో మరింత కష్టతరం చేయడం సరికాదని సూచించారు. పథకాలు అమలు చేయటం చేతగాక కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయ కుయుక్తుల ను పక్కనపెట్టి, రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షే మం కోసం కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలను, వారి అభివృద్ధిని అణగదొక్కే ప్రయత్నాలను విరమించాలని దాసోజు హితవుపలికారు.

నా విజయం అమరులకు అంకితం

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- శాసనమండలి సభ్యునిగా ప్రమాణం

శాసనమండలి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సమక్షంలో ఎమ్మెల్సీగా ప్రమాణం చేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి సభ్యుడిగా ఎన్ నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం నవీన్‌కుమార్‌రెడ్డిని మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు బీఆర్‌ఎస్ ప్రముఖులు కూడా నవీన్‌రెడ్డిని అభినందించారు. అనంతరం నవీన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ రేవంత్‌రెడ్డి అడ్డా కాదని కేసీఆర్ అడ్డా అని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు మరోసారి నిరూపించారని అన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనను ఆశీర్వదించిన బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు, మాజీ మంత్రి టీ హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా పనిచేశానని, ఇప్పుడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యానని.. స్థానిక సంస్థల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తన విజయాన్ని అమరవీరులకు అంకితం చేస్తున్నానని తెలిపారు. నవీన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎస్ నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, సీ లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, శేరి సుభాష్‌రెడ్డి, విఠల్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు తరలివచ్చారు.

తీన్మార్ మల్లన్న ప్రమాణ స్వీకారం...

పట్టభద్రుల స్థానం నుంచి ఎన్నికైన చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) కూడా ఎమ్మెల్సీగా ప్రమాణం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఎంపీ చామల కిరణ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

కేసీఆర్ పేరుంటే తప్పేంటి

ప్రభుత్వం హుందాగా వ్యవహరించాలి • పుస్తకాల వాపస్‌పై సబిత ఫైర్

హైదరాబాద్, జూన్ 13 (నమసే తెలంగాణ): పాఠ్యపుస్తకాలలో కేసీఆర్ పేరు ఉంటే తప్పేంటని మాజీ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేసీఆర్ ఫొటో, కేసీఆర్ గుర్తులు తొలగించాలనే ఆలోచనను పక్కనపెట్టి పాలనపై దృష్టిసారించాలని ప్రభుత్వానికి సూచించారు. తమిళనాడులో స్టాలిన్ సీఎం కాగానే జయలలిత ఫొటోతో ఉన్న బుక్స్, బ్యాగ్స్‌ను యథావిధిగా విద్యార్థులకు ఇచ్చి తన మంచితనాన్ని చాటుకున్నారని గుర్తుచేశారు. ఏపీలో సీఎం జగన్‌రెడ్డి బొమ్మతో ఉన్న కిట్లను పంపిణీ చేయాలని, ప్రజాధనాన్ని వృథా చేయొద్దని ఆదేశించి అక్కడి ప్రభుత్వం ఎంతో హుందాగా వ్యవహరించిందని, అటువంటి హుందాతనం రాష్ట్ర సీఎంకు ఎక్కడికిపోయిందని ప్రశ్నించారు. విద్యార్థులకు ఇచ్చిన బుక్స్‌లో కేసీఆర్ పేరు ఉన్నదని బుక్స్ వెనక్కి తెప్పించటం పేజీలను చించివేయటం, ఆ పేజీలపై మరో పేజీని అతికించటం సమంజసమా? ఇటువంటి అనాలోచిత చర్యల వల్ల ప్రజాధనం వృథా కాదా? అని సబిత ప్రశ్నించారు. అధికారంలో కొచ్చి ఆరునెలలు అవుతున్నా విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంపై దృష్టిసారించలేదని మండిపడ్డారు. తాము ఏటా 23 లక్షల మంది విద్యార్థులకు రూ. 108 కోట్లు వెచ్చించి రూ. 1.90 కోట్ల ఉచిత పుస్తకాలు ముద్రించి సకాలంలో అందజేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. రూ. 34.70 కోట్లతో 11.27 లక్షలమంది విద్యార్థులకు వర్క్‌బుక్స్ రూ. 12.30 కోట్లతో ఉచిత నోట్‌బుక్‌లను, పాఠ్యపుస్తకాలను అందించిన విషయాన్ని సబితాఇంద్రారెడ్డి గుర్తుచేశారు.

కేంద్రమంత్రులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్

కేంద్ర మంత్రుల బాధ్యతల స్వీకరణ

- బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి
- హోం శాఖ సహాయ మంత్రిగా బండి
- హాజరైన బీజేపీ నేతలు

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కిషన్‌రెడ్డి ముందుగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఉన్న వెంకటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించి, అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత శాస్త్రి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదేండ్లలో విద్యుత్ కొరతకు ప్రధాని మోదీ చెక్ పెట్టారని, వ్యవసాయానికి, పరిశ్రమలకు, ఇండ్లకు సరిపడా కరంటు సరఫరా అవుతున్నదని తెలిపారు. ఇందుకు బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పెరగడమే ప్రధాన కారణమని చెప్పారు. శక్తివంతమైన భారత్‌ను రూపొందించడంలో బొగ్గు, గనుల శాఖల పాత్ర కీలకమని, దాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తానని అన్నారు. మరోవైపు బండి సంజయ్ నార్త్ బ్లాక్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. జగద్గురు శంకరాచార్య, హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామీజీ హాజరై బండి సంజయ్‌ని ఆశీర్వదించారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, కేంద్ర మంత్రి నిత్యానందరాయ్, బీజేపీ ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, రాజాసింగ్, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్ రెడ్డి, సంకినేని వేంకటేశ్వరరావు, ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్ రెడ్డి, సుభాష్ తదితరులు అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన రామ్మోహన్

ఢిల్లీలోని రాజీవ్ గాంధీభవన్‌లో ప్రత్యేక పూజలు చేసి పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజారపు రామ్మోహన్ నాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాబినెట్‌లో అత్యంత చిన్న వయస్సులో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సామాన్య ప్రయాణికుల కోసం ఈజ్ ఆఫ్ ఫ్లయింగ్‌పై దృష్టి పెడతామని వివరించారు.

ఉపాధి ఉద్యోగులకు పే స్కేల్ కలేనా?

- 18 సంవత్సరాలుగా వెట్టిచాకిరి
- 12 వేల ఉద్యోగుల ఎదురుచూపులు
- ప్రజావాణిలోనూ విజ్ఞప్తులు
- ముందడుగు పడని సీఎం హామీ
- ఇంకా అందని మే నెల వేతనాలు

సమస్యలు పరిష్కరించాలని సిద్దిపేటలో ధర్నా చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ): ఉపాధి హామీ ఉద్యోగులు పే స్కేల్ కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పంచాయతీరాజ్ శాఖపై జరిగిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధి హామీ ఉద్యోగులకు పే స్కేల్ అమలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కానీ ఇంతవరకు పే స్కేల్ దేవుడు ఎరుగు కనీసం మే నెల వేతనం కూడా అందలేదని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో 12వేల మంది ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు. 18 సంవత్సరాలుగా వీరు ఉపాధి హామీ కూలీలకు జాబ్ కార్డు అందించడం, పని కల్పించడం, వారి లెక్కలు వేసి వివరాలను నమోదు చేయడం వంటి సేవలు అందిస్తున్నారు. గ్రామాలు, తండాలు, ఆవాసాలు, రోడ్డు సౌకర్యం లేని ప్రాంతాల్లో, గుట్టలు, ఎత్తయిన ప్రదేశాల్లో కూడా వీరు సేవలు అందిస్తున్నారు. సాధారణ వేతనంలో పని చేస్తున్న వీరికి పే స్కేల్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే పంచాయతీరాజ్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన సమీక్షలో ఉపాధి హామీ ఉద్యోగులకు వెంటనే పే స్కేల్ అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దానికి ఇంత వరకు ముందడుగు మాత్రం పడలేదు. రాష్ట్రంలో నాన్ ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ 7600 మంది, ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయీస్ (ఎఫ్‌టీఈ) 4500 వరకు పనిచేస్తున్నారు. వీరందరు కలిసి 12 వేల మంది వరకు ఉపాధి హామీలో పనిచేస్తున్నారు. కాంట్రాక్టు విధానంలో సంవత్సరాల కొద్ది పనిచేస్తున్నా చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. నియామకమయ్యే సమయంలో వీరంతా రోస్టర్ విధానంలో, రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా ఎంపికయ్యారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నియామకమైనా తమను రెగ్యులరైజ్ చేయడంలేదని, కనీసం పే స్కేల్ కూడా అమలులో జాప్యం చేస్తున్నారని ఉపాధి హామీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పే స్కేల్ పెంపు అమలు చేస్తే ఒక్కో ఉద్యోగికి కనీసం 8 వేల నుంచి 15 వేల వరకు వేతనాలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వేతనాల పెంపు కోసం ప్రజావాణిలోనూ ఉపాధి హామీ ఉద్యోగులు వినతి పత్రం ఇచ్చామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వేతనాలు ఇవ్వడానికే నానా తిప్పలు పెడుతుంది. మే నెల వేతనాలు ఇంకా విడుదల చేయలేదని, జూన్ కూడా సగం రోజులు పూర్తి అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు జీతమే ఇవ్వకుంటే ఇక పే స్కేల్ ఎలా అడుగుతారనే ఉద్దేశంతోనే జీతాలను ఆలస్యం చేస్తున్నారని ఉపాధి హామీ ఉద్యోగులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాధనం దుర్వినియోగం

- ఆ పాఠ్యపుస్తకాలను కొనసాగించండి
- రాష్ట్రం వచ్చిన కొత్తలో పాత బుక్స్ అందజేశాం: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



హైదరాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ సంకుచిత దృక్పథం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నదని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. రేవంత్‌రెడ్డి సంకుచిత రాజకీయాలకు విద్యార్థులు బలి అవుతున్నారని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల ముందుమాటలో కేసీఆర్ పేరు ఉందని, ఆ పుస్తకాలను వాపస్ తీసుకోవడం ఆయన కురచబుద్ధికి నిదర్శనమని విమర్శించారు. గురువారం 'నమస్తే తెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన కొత్తలో పాత పుస్తకాలను మార్చలేదని, ఏడాది పాటు పాత పుస్తకాలనే పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఆ పుస్తకాల్లో గత సీఎం పేరు ఉన్నదని.. వాటిని చించండి, వాటికి స్టిక్కర్లు వేయండి, కొత్త పేపర్లు అతికించండి అంటూ ఆదేశాలు ఇవ్వలేదని తెలిపారు. విడిపోయిన తరువాత ఏపీలో కూడా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పాత పుస్తకాలనే వాడారు తప్ప మార్చలేదని చెప్పారు. రేవంత్ రెడ్డి ఎప్పుడు మాట్లాడినా 'మాకు బేషజాలు లేవని.. అహంకారం లేదని.. మాది ప్రజా పాలన అంటూ నొక్కి వక్కాణిస్తుంటారని, కానీ ప్రతి చిన్న విషయంలో కూడా సంకుచితంగా వ్యవహరిస్తున్నారు' అని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం, పుస్తకాలు మార్చడంపై బేషజాలకు వెళ్లవద్దని దేశపతి సూచించారు.

భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్

మొదటిపేజీ తరువాయి...

నేతలు కొందరు కేసీఆర్‌కు సూచించినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలు పెదవి విరుపుతో ఉన్నారు. వేచి చూసే ధోరణిలో ఉన్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహం ఏమిటి? తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలేమిటి? తెలంగాణ హక్కులకు కలుగుతున్న భంగం, వాటి పరిరక్షణకు పార్టీగా అనుసరించాల్సిన వ్యూహం ఏమిటి? తదితర అంశాలపై పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో చర్చించి అందుకు అనువైన కార్యాచరణను రూపొందించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. తెలంగాణను సాధించి అభివృద్ధిలో అగ్రపథంలో నిలిపామని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది.

ఆస్ట్రేలియా వీసా నిబంధనలు కఠినతరం

కాన్‌బెర్రా: అంతర్జాతీయ విద్యార్థులు స్టూడెంట్ వీసాలతో ఆస్ట్రేలియాలో నిరవధికంగా ఉండిపోవడాన్ని నిరోధించేందుకు ఆ దేశ ప్రభుత్వం కట్టుదిట్టమైన నిబంధనలను తీసుకొచ్చింది. దీంతో తాత్కాలిక వీసా హోల్డర్లు ఇకపై ఆస్ట్రేలియాలో ఉంటూ స్టూడెంట్ వీసా కోసం దరఖాస్తు చేయడం సాధ్యం కాదు. ఈ నిబంధనలు వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తాయి. కేవలం దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడేవారికే వీసాలను మంజూరు చేయాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. టెంపరరీ గ్రాడ్యుయేట్, విజిటర్, మారిటైమ్ క్రూ వీసాల వంటి తాత్కాలిక వీసా హోల్డర్లు వచ్చే నెల ఒకటి నుంచి ఆస్ట్రేలియాలో ఉంటూ, స్టూడెంట్ వీసా కోసం దరఖాస్తు చేయడానికి అవకాశం ఉండదు. దీని ప్రభావం ఇప్పటికే ఆస్ట్రేలియాలో ఉన్న వేలాది మంది భారతీయ విద్యార్థులపై పడుతుంది. ఆస్ట్రేలియాలో చదవాలనుకునే విజిటర్ వీసా దరఖాస్తుదారులు ఆ దేశం వెలుపలి నుంచి దరఖాస్తు చేయాలి. తాత్కాలిక వీసాలు తీసుకున్న అంతర్జాతీయ విద్యార్థులు ఆస్ట్రేలియాలో నిరవధికంగా ఉండిపోవడాన్ని నిరోధించేందుకు ఆ దేశం ఈ చర్యలు చేపట్టింది. గత ఏడాది డిసెంబరు 11న ప్రకటించిన నూతన మైగ్రేషన్ వ్యూహంలో భాగంగా ఈ మార్పులను తీసుకొచ్చింది.

కర్రిగుట్టల అడవిలో పేలిన ప్రెషర్ బాంబ్

చొక్కాల మహిళకు తీవ్ర గాయాలు

వెంకటాపురం (నూగూరు), జూన్ 13: మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబు పేలి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండల పరిధిలోని చొక్కాలకు చెందిన సుమారు 100 మందికి పైగా గ్రామస్థులు కలిసి.. డోలీ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న బెడం మల్లన్న దేవుడిని దర్శించుకునేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కర్రిగుట్టల సమీపంలో మావోయిస్టులు అమర్చిన ప్రెషర్ బాంబును గ్రామానికి చెందిన డర్రా సునీత తొక్కడంతో అది పేలింది. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆమెను గ్రామస్థులు జోలె కట్టుకొని సుమారు 25 కిలోమీటర్ల దూరం గుట్టలు దింపుకుని మల్లాపురం గ్రామ సమీపంలోని పాలెం ప్రాజెక్ట్ వద్దకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి బంధువులు కారులో ఎక్కించుకొని వెంకటాపురం దవాఖానకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని దవాఖానకు తరలించారు.

'వంశీ' వర్సెస్ ఎమ్మెల్యేలు!

- పాలమూరు పార్లమెంట్ కాంగ్రెస్‌లో భగ్గుమంటున్న వర్గవిభేదాలు
- ఎంపీ స్థానం ఓటమిపై రాజుకుంటున్న అగ్గి
- ఏఐసీసీకి చేరిన పంచాయితీ
- ఎమ్మెల్యేల దందాలపై నజర్
- సీఎంను కలిసేందుకు జంకుతున్న ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ ఓటమి చెందడానికి పార్టీలోని వర్గవిభేదాలే కారణమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తక్కువ ఓట్లతో వంశీచంద్‌రెడ్డి ఓటమికి సిట్టింగ్ ఎమ్మెల్యేలే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సంస్థాగతంగా బలం లేని బీజేపీని ఓడించడం.. ఓటమి బాధతో ఉన్న బీఆర్‌ఎస్‌ను లెక్కలోకి తీసుకోకుండా ఇక గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. కానీ ఎన్నికల్లో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడు సెగ్మెంట్లు మినహా మిగతా వాటిలో బీజేపీకి భారీ మెజారిటీ వచ్చింది. ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే పార్టీ అభ్యర్థి ఓడిపోవడంపై అధిష్ఠానం గుర్రుగా ఉన్నట్టు సమాచారం. ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో కొందరు ఎమ్మెల్యేలు కావాలనే ఓడించారని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీకి వంశీ ఫిర్యాదు చేశారట. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది. వారికి రాబోయే రోజుల్లోనూ ఎలాంటి పదవులు ఇవ్వొద్దని సూచించారట. ఇదిలావుండగా ఎంపీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రి పదవి ఇస్తానని ప్రకటించడంతో బీసీ సామాజిక వర్గానికి గౌరవం దక్కుతుందని అంతా భావించారు. కానీ అదే నియోజకవర్గంలో బీజేపీకి భారీ లీడ్ రావడంతో మిగతా సామాజిక వర్గాల నేతలు ఎమ్మెల్యేకు మంత్రి పదవి వద్దని సూచిస్తున్నారట. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వర్గం ఎదురుదాడికి దిగింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేని టార్గెట్ చేస్తున్నారంటూ రెడ్డి వర్గంపై విరుచుకుపడింది. కాగా మరోవైపు అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు దందాల్లో మునిగిపోయినట్టు సమాచారం. కొంతమంది ఇసుక దందా.. మరికొందరు మట్టిదందా.. చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేజిక్కించుకున్నారు. అంతేకాకుండా పైరవీలు కూడా పెద్ద ఎత్తున ప్రారంభించారు. నారాయణపేట జిల్లాలోని ఓ ఎమ్మెల్యే తన బంధువులతో ఏకంగా ఇసుక దందాకు తెరలేపారు. దీన్ని కొంత మంది నేతలు చెక్ పెట్టారు. మిగతా నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. ఇక ఉమ్మడి జిల్లా కేంద్రంలో అయితే బీజేపీకి లీడ్ రావడంతో సిట్టింగ్ ఎమ్మెల్యే అభివృద్ధిలో కలిసి పోదాం అంటూ చేసిన ప్రకటన కాంగ్రెస్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఇదంతా కావాలని కొందరు ఎమ్మెల్యేలు పనిగట్టుకొని పార్టీ అభ్యర్థిని ఓడించారనే ప్రచారం జోరందుకున్నది.

వంశీచంద్‌రెడ్డి

సీఎంను కలవాలంటేనే నేతల్లో భయం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పార్టీ ఎంపీ ఓడిపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతున్నది. ఏడు సెగ్మెంట్లలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉండి కూడా ఏ మాత్రం క్యాడర్ లేని బీజేపీ గెలవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక సీఎం కూడా సొంత జిల్లాలో కొంతమంది నేతలు హ్యాండిచ్చారని బాహాటంగా అంటున్నారు. రాష్ట్రంలో ఇతర చోట్ల భారీ మెజారిటీతో గెలిచినా.. సొంత జిల్లాలో మాత్రం కొద్దిపాటి ఓట్ల తేడాతో ఓటమిపాలు కావడంతో రాజకీయ విమర్శలు చెలరేగాయి. దీంతో ఇదంతా కొంత మంది నేతలు కావాలని బీజేపీకి మద్దతు ఇచ్చారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.